


# ఆకలి చచ్చిపోయింది

"ఉఫ్! ఈ నగరంలో కూడా వేడి ఎక్కువగానే ఉంది" మనసులోనే అనుకుంటూ, హోటల్‌లో ఒక మూలగా కుర్చీలో ఫ్యాన్ కింద కూచున్నాడు కమల్‌సింగ్. వూరట కలిగింది. కర్చీఫ్‌తో చెమట తుడుచుకుని బల్లమీద రెండు మోచేతులు ఆనించి కొంచెంసేపు తన్ను తాను మరచిపోయాడు. 'ఈ నగరం నాకు పూర్తి కొత్తగా వుంటుందనీ, ఇక్కడి భాష తెలియకపోవడం వలన ఇబ్బందిగా వుంటుందనీ' నేననుకునే వాన్ని. కానీ అలా ఏమీ అనిపించలేదు. అలా ఏమి జరగలేదు.

నేనిప్పటికే అక్కడక్కడా తిరిగాను. స్వంత వూరిలోనే ఏవో కొత్త, పాత వీధుల్లో తిరుగుతున్నాననిపించింది. పెద్దపెద్ద భవంతులు, రకరకాల వస్తువులతో అలంకరించిన ఖరీదైన దుకాణాలు, దుకాణాల్లో సందడి, హోటళ్ళలో సందడి, రోడ్లమీద వాహనాల పరుగులు, ట్రాఫిక్ పోలీసుల విజిల్సు, మధ్యలో సైకిళ్ళూ, రిక్షాలూ, కార్లు, ట్రక్కులూ, రోడ్లకిరువైపుల రెండు పర్వతాల్లా నిశ్చలంగా ఆగిపోవడం, మధ్యలో జనసమూహం ప్రవాహంలా దూసుకుపోవడం, రోడ్లలో ఎర్రని, పచ్చని బస్సీల సామ్రాజ్యం, అన్నీ మా నగరంలో మాదిరే వున్నాయి. మధ్యమధ్యన మురికి కాలువల సంగమం, సంగమ తీరాల వెంబడి నల్లని దోమల సమూహంలా గుడిసెలు, గాడిద మృత కళేబరం పొట్టలో ముసురుకున్న ఈగలు, క్రిమి కీటకాల్లా, గుడిసెల్లో పిల్లలు, ఆకలిదప్పులతో తల్లడిల్లుతూ, అర్ధనగ్నంగా, మృతప్రాయులైన మనుషులు, మా నగరాన్నే గుర్తుకు తెస్తున్నాయి. గొప్ప మ్యూజియంలా వుందీ నగరం. మన దేశంలో ప్రతి నగరం ఒక మ్యూజియం కాబోలు. ఇక్కడ ప్రతిరోజూ ఎన్నో సాంస్కృతిక, సాహిత్య, ధార్మిక కార్యక్రమాలు జరుగుతున్నట్లనిపిస్తోంది. ఈ సమస్త కార్యక్రమాల వేడి ఇక్కడ సర్వదా వుంటుంది కాబోలు. మరి ఈ వేడిమి? ఉఫ్! దీనికి కూడా కొదువ లేదు".


తానిప్పుడెక్కడున్నది కమల్‌సింగ్ పూర్తిగా మరచిపోయాడు. అసలు తాను హోటల్ కెందుకొచ్చాడు? ఎంతోసేపటి నుంచి బేరర్ ఆర్డరు కోసం, తన బల్లవద్దనే నిరీక్షిస్తున్నాడని కూడా అతనికి తెలియలేదు.

అంతవరకు ఖాళీగా వున్న కుర్చీలు నిండాయి. అక్కడి నుంచి వేడి, వాడియైన మాటలు కమల్‌సింగ్ చెవులకు సోకసాగాయి. అతనికి కొంత ఇబ్బందిగా తోచింది. కానీ అకస్మాత్తుగ ఫక్కున నవ్వు వినిపించడంతో కమల్‌సింగ్ పూర్తిగా మన లోకంలోకి వచ్చాడు.




హిందీమూలం: డా॥ పోలి విజయరాఘవరెడ్డి

తెలుగు అనువాదం: కొమ్మిశెట్టి మోహన్



ప్రస్తుతం యెదుట టి.వీ.లో ఒక దృశ్యం తర్వాత మరో దృశ్యం వచ్చినట్లు, బేరర్‌తో పాటు హోటల్ వాతావరణమంతా కళ్ళముందుకొచ్చింది. అతను నీళ్ళ గ్లాసు తీసుకుని తాగసాగాడు. ఏమి తెప్పించుకు తినాలని ఆలోచనలో వడ్డాడు. ఇంతలో పక్క బల్ల నుంచి వినిపించింది "నాలుగు స్పెషల్ నేతి మాసాలా దోసెలు".

కమల్‌సింగ్ ఒక స్పెషల్ నేతి మసాలా దోసె ఆర్డరిచ్చాడు.

తన నగరంలో ఎప్పుడో ఒకసారి మద్రాసీ హోటల్‌లో మసాలా దోసె తిన్నాడు. కానీ స్పెషల్ మసాలా దోసె, స్పెషల్ నేతి మసాలా దోసె తినలేదు. ఈ స్పెషల్ మసాలా దోసె ఎలా వుంటుందో చూద్దామని అతని మనసులో కుతూహలం కలిగింది.

ఉదయం నుంచీ అతను ఏమీ తినలేదు కూడా. గౌలిగూడలో తన మిత్రుని ఇంట్లో ఉదయాన్నే టీ తాగి బయలుదేరాడు బిర్లామందిర్ చూడ్డానికి. బిర్లామందిర్ గురించి అతను వినివున్నాడు. మందిరంపైకి నుంచి చూస్తే హైదరాబాద్ రమణీయ దృశ్యాలన్నీ కనిపిస్తాయి. ఆ మందిరం చూడాలనీ, అక్కడ కూచుని నగర చిత్తరువునంతా తన మనసులో చిత్రించుకోవాలనీ అతనికి కోరిక కలిగింది.

అతను మెయిన్ రోడ్డు మీదికి వచ్చేటప్పటికి ఒక బస్సు నిలబడి వుండటం చూశాడు. జనం అందులో కూచుని వున్నారు. బస్సు బిర్లా మందిర్‌వైపు వెళుతుందని కమల్‌సింగ్‌కు నమ్మకం కలిగింది. అతను ఆత్రంగా బస్సు ఎక్కి కూచున్నాడు. కండక్టర్ చేతికి రూపాయి అందిస్తూ, 'బిర్లామందిర్' అన్నాడు. కండక్టరు అతని వైపు విచిత్రంగా చూశాడు. ఠక్కున అతని నోటు తిరిగి ఇస్తూ అన్నాడు "దిగు, దిగు ఇది బిర్లా మందిర్ వెళ్ళదు. 19వ నంబర్‌లో వెళ్ళు".

కండక్టర్ విజిల్ ఊదాడు. బస్సు బయలుదేరింది. కమల్‌సింగ్ ఒక్కసారిగా లేచి, కదులుతున్న బస్సులోంచి దిగాడు. దిగడంలో అతని శరీరం కుదుపులకు లోనైంది. కానీ శారీరక కుదుపులకన్నా మానసిక కుదుపులు బలమైనవి. కండక్టరు తనపట్ల చాలా నిర్దయగా ప్రవర్తించాడనిపించింది. కండక్టరు మనసులో తనను తిట్టుకుని వుంటాడని కూడా అతని ప్రవర్తనను బట్టి కమల్‌సింగ్‌కు బోధపడింది.

"బస్సు ఎక్కడికి వెళుతుంది, ఎక్కడికి వెళ్ళదు, అని తెలుసుకోకుండానే దొరల్లా కూచుంటారు. బస్సు ఎక్కడికి వెళ్ళేదీ, తెలియనప్పుడు ఎవరినైనా ఎందుకని అడగరు? సూటు బూటు ధరించి గొప్పగా చదువుకున్నవారే అందరూ మరి?"

**ఒక బక్క పలుచని మహిళ బయటినుంచి వచ్చి తినుబండారాలు వుంచిన అలమారీ పక్కగా, లోపలి తలుపుకు ఎదురుగా నిలబడింది. కమల్‌సింగ్‌కు మొదట ఆమెమీద కోపమొచ్చింది. బేరర్‌ను చూడాలని తాను తలుపు వైపు దృష్టి సారిస్తే మధ్యలో ఈమె భూతంలా వచ్చి అడ్డు నిలిచింది. కానీ ఆమె ముఖం చూడగానే క్షణంలో అతని కోపం మాయమైంది. అతనికి ఆమె చాలా బాధలో వున్నట్లనిపించింది.**

అతనికి కండక్టరు మీద కోపమొచ్చింది. టికెట్టు లేకుండా ప్రయాణిస్తూ, రైలుపెట్టెలోంచి దింపివేయబడిన ప్రయాణీకుడిలా కమల్‌సింగ్ తలవంచుకుని అక్కడినుంచి త్వరత్వరగా వెళ్ళిపోయాడు. బస్‌స్టాపులోని వారందరి దృష్టి ఒక్కసారిగా తనపైనే కేంద్రీకృతమైనట్లు, తన మూర్ఖత్వానికి వారంతా నవ్వుతున్నట్లు అనిపించిందతనికి. తన కులంలోంచి వెలివేయబడినవాడు, తిరిగి తన కులంలోకి తిరిగి రావడానికి సాహసించలేనట్లే, కమల్‌సింగ్ మళ్ళీ ఏ బస్సులోనూ ఎక్కడానికి సాహసించలేదు. అతనికి తనమీద, తన మూర్ఖత్వంమీద కోపమొచ్చింది. తాను అడక్కుండానే బస్సులోకి ఎందుకెక్కాలి? ఒకవేళ ఎక్కినా సీట్లో కూర్చొనేముందైనా కండక్టరును ఎందుకు అడగలేదు? నడుస్తూ వుండగా అతనికి 19వ నంబరు బస్సు కూడా కనిపించింది. కానీ అందులో ఎక్కడానికి అతనికింకా ధైర్యం పుంజుకోలేదు. అంతే! అతనొక నిర్ణయానికొచ్చాడు. "నడిచే వెళతాను. ఎక్కడికి చేరతానో చూద్దాం. తిరిగి తిరిగి సాయంత్రానికెలాగో గౌలిగూడ చేరుకుంటాను. నడచినందువల్ల నగరం కూడా బాగా తెలుసుకోవచ్చు".

నగరమంతా తిరుగుతూ, తిరుగుతూ ఒంటిగంట అయింది. ఆకలి దంచేస్తోంది. అందుకే ఈ హోటల్లోకొచ్చి కూచున్నాడు. "ఇదీ మంచిదే అయింది. స్పెషల్ నేతి మసాలా దోసె తింటే ఆకలి శాంతిస్తుంది. సాయంత్రం స్నేహితునింట్లో భోజనం చేయవచ్చు" బేరర్‌కు ఆర్డరిచ్చి అతను అనుకున్నాడు.

గ్లాసు ఖాళీగా వుండటం చూసి హోటల్ నౌకరొకడు కమల్‌సింగ్ గ్లాసులో నీళ్ళు నింపాడు. కమల్‌సింగ్ మళ్ళీ నీరు తాగాడు. ఈసారి హోటల్ నలుదిశలా దృష్టి సారించాడు. ఒకరు దోసె, ఇంకొకరు ఇడ్లీ, మరొకరు వడ, ఇలా ఎవరెవరో ఏవేవో తింటున్నారు. కొందరు మాటల్లో మునిగి వున్నారు. బేరర్ తీసుకు రాగానే ఆబగా తినేయాలని మరికొందరు ఆర్డరిచ్చి కాచుకుని వున్నారు.

ఎదురుగా బల్లవద్ద కూచున్నవ్యక్తి వేడి ఇడ్లీ తుంచి నోట్లో వేసుకున్నాడు. పాపం, మానవుని నాలుక కాలింది. పిల్లి వేడిపాలు తాగి చెవులు నిక్కపొడుచుకుని నాలుక చప్పరించినట్లు, అతను ముఖం అదోలా పెట్టి మింగాడు. అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఇడ్లీ చాలా వేడిగా వుంది కాబోలు. నాలుకతో బాటు అంగిలి కూడా కాలింది కాబోలు. అతను నీరు తాగాడు. నాలుగువైపుల చూశాడు. తర్వాత ప్లేట్లో ఇడ్లీ చిన్నచిన్న ముక్కలు చేయసాగాడు. ఇదంతా చూసి కమల్‌సింగ్‌కు నవ్వొచ్చింది. అతను తన నవ్వాపుకున్నాడు. ఇంతగా ఆకలిగొన్నవారు ఎక్కడి నుంచి వూడిపడ్డారనుకున్నాడు. ఏ హోటల్‌కు వెళ్ళినా ఇలాంటి ఆకలి జీవుల గుంపు వుంటుంది కాబోలు. కానీ ఒంటిగంటకే ఇంతమంది ఇంత ఆకలితో వుండటమే అతనికి బోధపడలేదు. వీరు కూడా తనలాగే ఉదయం నుంచీ ఏమీ తినలేదు కాబోలు. తనలాగే వీరంతా ఈ నగరానికి కొత్తేమో! అయినా ఇంతగా ఆకలిగొని వున్నారెందు కు? చూడబోతే వీరు ఎన్నో జన్మల నుంచి ఆకలిగొన్నట్లనిపిస్తోంది. ఈజన్మలోనే అన్ని జన్మల ఆకలి తీర్చుకోవాలనుకున్నట్లుంది. కాకపోతే మరేమిటి? ఆ మానవుడు చూడు! బేరర్ తీసుకురాగానే ఇడ్లీ మీద విరుచుకుపడ్డాడు. నాలుక కాల్చుకుని గుడ్లు తేలేశాడు.

పక్క బల్లమీద ఆర్డరు ప్రకారం స్పెషల్ మసాలా నేతిదోసెలు వచ్చేశాయి. వారు తింటూంటే కమల్‌సింగ్‌కు దోసె సువాసన సోకుతోంది. సువాసన వలన అతని ఆకలి పెరగసాగింది. అతను తల్లడిల్లాడు. అసహనంగా అతను బేరర్‌కోసం లోపలి తలుపువైపు చూడసాగాడు. కానీ అతని చూపులు మధ్యలోనే ఆగిపోయాయి. ఎవరో ఒక బక్క పలుచని మహిళ బయటినుంచి వచ్చి తినుబండారాలు వుంచిన అలమారీ పక్కగా, లోపలి తలుపుకు ఎదురుగా నిలబడింది. కమల్‌సింగ్‌కు మొదట ఆమెమీద కోపమొచ్చింది. బేరర్‌ను చూడాలని తాను తలుపువైపు దృష్టి సారిస్తే మధ్యలో ఈమె భూతంలా వచ్చి అడ్డు నిలిచింది. కానీ ఆమె ముఖం చూడగానే క్షణంలో అతని కోపం మాయమైంది. అతనికి ఆమె చాలాబాధలో వున్నట్లనిపించింది.

ఏదో తెలియని దుఃఖంతో బాధపడుతోంది. ఆమెకు ముప్పై యేళ్ళుంటాయి. ఎన్నో రోజులుగా తిండి లేకపోవడం వలన ఇలా బలహీనంగా వుంది కాబోలు. పాతవై చిరిగిపోయిన బట్టలు ధరించి వుంది. కానీ బట్టలు మురికిగా లేవు. తల అస్తవ్యస్తంగా వుంది. కళ్ళు లోపలికి పోయి వున్నాయి. కానీ అవి కాంతివంతంగా వున్నాయి. ఆమె ఎంతో ఆకలితో వున్నట్లుంది. కానీ ఈ ఆకలిగొన్న గుంపు మధ్య ఆమె ఎంతో నిశ్చలంగా నిలబడి వుంది. అందువలన ఆమె అంతగా ఆకలిగొని వున్నట్లు ఎవరూ వూహించలేరు. ఆమె అక్కడికి రాగానే తన చురుకైన కళ్లతో అందర్నీ ఒకసారి చూసింది. తర్వాత అలమారీలోని తినుపదార్థాలను చూసింది. ఆమె నోట్లో నీరూరాయి. కళ్ళల్లో ఆశ కనిపించింది. కానీ క్షణంలో ఆమె తన్ను తాను నియంత్రించుకుంది. తననాస్థితిలో ఎవరూ చూడలేదు కదా అన్నట్లు ఆమె సంకోచిస్తూ నలువైపులా చూసింది.

బేరర్ లోపలి నుంచి వస్తూ "పక్కకు తప్పుకో, దారివ్వు, ఏం కావాలి నీకు" అన్నాడు. ఆమె జవాబు చెప్పకముందే ఆ బేరర్ కమల్‌సింగ్ దగ్గరకొచ్చాడు. వినయంగా వంగి అన్నాడు "క్షమించండి సార్! ఆలస్యమయింది. మసాలా అయిపోయింది. ఇప్పుడు తయారయింది. మీ దోసె తయారయింది. ఇప్పుడే తెస్తాను" కమల్‌సింగ్ నిబ్బరంగా అన్నాడు "ఏం తొందరలేదు. నిదానంగానే తీసుకురా! బేరర్ తన పొడవాటి తెల్లని పళ్ళు బయటపెడుతూ, కృతజ్ఞతలు తెలియచేశాడు.

బేరర్ అక్కడినుంచి తక్కున అలమారీ వద్దకు వచ్చాడు. "ఏం కావాలి?" ఆమెనడిగాడు. ఆమె ఏమీ చెప్పకుండా ఒక పదార్థం వైపు వేలు చూపింది.

"అవి మసాలా వడలు. రూపాయికి ఒక్కటి. కావాలా?" ఆమె అవునంది. ఒక వేలు చూపెట్టింది. బేరర్ ఒక వడ ప్యాక్ చేసి ఆమె చేతికిచ్చాడు. ఆమె మళ్ళీ ఇంకో పదార్థం వైపు వేలు చూపెట్టింది.

"ఇది మైసూర్‌బోండా. ఒక్కటి ముప్పావలా. ఎన్ని కావాలి?" ఆమె మళ్ళీ ఒక వేలు చూపెట్టింది. ఈసారి బేరర్ ఆమె వైపు గుర్రుగా చూశాడు. బోండా పార్సిల్ చేయసాగాడు. ఆమె పక్కనున్న బల్లవద్ద కుర్చీ ఖాళీగా వుండటం చూసి అక్కడ కూచుంది. చాలా సేపటినుంచి నిలబడి ఆమె అలసిపోయినట్లుంది. కాళ్ళకున్న ధూళినిబట్టి ఆమె చాలా దూరంనుంచి నడచివచ్చినట్లనిపిస్తోంది.

"లే, లే ఇక్కడి నుంచి లే! దొరసానిలా కూచున్నావు. నింపాదిగా తినడానికి. మీ

ఆమె తక్కున అక్కడినుంచి లేచింది. ఆమె కళ్ళలో నీళ్ళు తిరుగాడసాగాయి. ఆమె కమల్ సింగ్‌వైపు చూసింది. కమల్ సింగ్ తప్ప అక్కడ మరెవరు ఆమెవైపు చూడటం లేదు.
తనకు జరిగిన అవమానం కమల్‌సింగ్ చూశాడని తెలిసి ఆమె మరింత బాధపడింది.

నాయన కాలంలో ఎప్పుడైనా కుర్చీ మీద కూచుని తిన్న ముఖమేనా? ఇది నీలాంటి వాళ్ళు కూచుని తినే చోటు కాదు" బేరర్ కళ్ళెర్రజేసి అన్నాడు. "వెళ్ళు ఇక్కడనుంచి త్వరగా వెళ్ళు. వెళ్ళి ఎక్కడైనా రోడ్డువారగా కూచుని నింపాదిగా తిను" బోండా ప్యాకెట్ ఆమె చేతికిచ్చాడు.

ఆమె తక్కున అక్కడినుంచి లేచింది. ఆమె కళ్ళలో నీళ్ళు తిరుగాడసాగాయి. ఆమె కమల్‌సింగ్‌వైపు చూసింది. కమల్‌సింగ్ తప్ప అక్కడ మరెవరు ఆమె వైపు చూడటం లేదు. తనకు జరిగిన అవమానం కమల్‌సింగ్ చూశాడని తెలిసి ఆమె మరింత బాధపడింది. రెండు ప్యాకెట్లు తీసుకుని, ఆమె బరువైన హృదయంతో అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

"పార్సిల్, ఒక రూపాయి ముప్పావలా" బేరర్ తన భాషలో కేకేసి, కమల్‌సింగ్ కోసం దోసె తీసుకురావడానికి లోపలికెళ్ళాడు.



కౌంటర్లో డబ్బు చెల్లించి ఆమె బయటికి వెళ్ళిపోయింది. ఇంతలో బేరర్ స్పెషల్ నేతి మసాలా దోసె తీసుకువచ్చి కమల్‌సింగ్ బల్లమీద వుంచాడు. "ఇదిగో భాయ్! ఇలా చూడు, బిల్లు త్వరగా ఇచ్చెయ్. నా స్నేహితుడొకరు అటు వెళుతున్నాడు. అతన్ని తప్పక కలవాలి. నా బదులు దోసె నువ్వే తిను" కమల్‌సింగ్ కుర్చీలోంచి లేస్తూ అన్నాడు. కౌంటరువద్ద బిల్లు చెల్లించి కమల్‌సింగ్ కూడాత్వరత్వరగా బయటికొచ్చాడు.

ఆమెను గుర్తించడానికి అతనికెంతోసేపు పట్టలేదు. అతను ఆమె వెనుకే నడవసాగాడు. ఆమె చాలా వేగంగా నడుస్తోంది. 'షంటింగ్'లో ఢీకొన్న గూడ్సు బండి పెట్టెలు గుర్తుకొచ్చాయి కమల్‌సింగ్‌కు. ఇంకా ఆ ఢీకొన్న వేగముంది. అందుకనే ఆమె అదే స్పీడులో పరుగిడుతోంది. బేరర్ మాటలకు ఆమె ఎంతో బాధపడింది. అతను ఆమె వెంట వెళ్ళే కొలదీ అతని మనసులో కుతూహలం పెరుగసాగింది. "ఆమె ఎవరు? ఎక్కడికి వెళుతోంది? తాను తీసుకు వెళుతున్న పదార్థాలు తానే తింటుందా? లేక మరెవరికోసమా? ఈమె ఆశ్రితులెవరో ఈమె కంటె ఆకలిగొని వున్నారేమో? వారికోసమని హోటల్ నుంచి ఈ పదార్థాలు తీసుకు వెళుతోంది కాబోలు!" అతను మళ్ళీ ఆలోచనలో పడ్డాడు, "ఆమె ఇంటికే వెళితే సరిపోతుంది కదా! ఆమె చిత్రమే గీచి మరునాడు రవీంద్రభారతిలో జరుగబోయే చిత్ర ప్రదర్శనలో ప్రదర్శించవచ్చు".

"బద్మాష్! మర్యాద లేదు!" అకస్మాత్తుగా ఆమె నోటినుంచి వినగానే కమల్‌సింగ్‌కు కుతూహలం మాయమయింది. అతను అవాక్కయాడు.

"దొరసాని" అన్నాడు. నా తండ్రిని కూడా తిట్టాడు. రోడ్డు వార కూచుని తినమన్నాడు. వాడు నన్నేమనుకున్నాడు? నన్నవమానిస్తాడా? మర్యాద తెలియని మనిషి! నేనెంతో ఆకలితో నున్నానని రోడ్డుమీదనే గతుకుతానని అనుకున్నాడేమో! ఇదిగో రోడ్డుమీదనే కూచుని తింటాను..."అంటూ రెండు ప్యాకెట్లు దూరంగా విసిరేసింది. తేలికపడ్డట్టు ఏదో గొణగసాగింది. "ఒరే నా కుక్కలు తింటాయిరా రోడ్డు మీద నీ తిండి. నేను తింటానా? నా ఆకలి చచ్చిపోయిందెప్పుడో. కానీ నేను చావలేదు. నేను బతికుండగా నా గౌరవం చావనివ్వను" రెండు చేతులు విదిలిస్తూ వేగంగా ఊపుతూ ఆమె సంతోషంగా నడవసాగింది.

కమల్‌సింగ్ అక్కడి నుంచి వెనుదిరిగాడు. అతని నోట్లోంచి వచ్చింది "ఆకలి చచ్చిపోయింది."